తెలంగాణ
వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871

తెలంగాణ వెన్నెల వాక్కు
**విలేకరులు కావలెను**
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :72 | 28-09- 2026 | సోమవారం | పేజీలు: 4 | వెల:03/-

# ప్రపంచ పర్యాటక పటంలో తెలంగాణకు ఉన్నత స్థానం

## పర్యాటక రంగ అభివృద్ధికి టూరిజం పాలసీ 2025--30: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు, దేశ విదేశాల నుంచి రాష్ట్రాన్ని సందర్శిస్తున్న పర్యాటకులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణకు ఉన్న అపారమైన సహజ, సాంస్కృతిక, చారిత్రక, ఆధ్యాత్మిక సంపదను ప్రపంచ పర్యాటక పటంలో మరింత ఉన్నత స్థానంలో నిలపాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు.

చారిత్రక కట్టడాలు, దేవాలయాలు, కోటలు, జలపాతాలు, అటవీ ప్రాంతాలు, వన్యప్రాణి అభయారణ్యాలు, చెరువులు, జానపద కళలు, పండుగలు తెలంగాణ ప్రత్యేకతను చాటుతున్నాయని సీఎం తెలిపారు. రామప్ప, వరంగల్, యాదాద్రి, భద్రాద్రి, అలంపూర్, మేడారం, హైదరాబాద్‌లోని చారిత్రక కట్టడాలు తదితర ప్రాంతాలను సమగ్రంగా



అభివృద్ధి చేసి దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ టూరిజం పాలసీ 2025--30 ద్వారా పర్యాటక రంగంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కొత్త పర్యాటక ప్రాజెక్టులు, అడ్వెంచర్ టూరిజం, క్యారవాన్ పార్కులు, వే-సైడ్ అమినిటీస్, ఎకో టూరిజం వంటి రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, మెడికల్ టూరిజంతో పాటు హెరిటేజ్ టూరిజానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. పర్యాటకులకు మెరుగైన వసతులు, సౌకర్యవంతమైన ప్రయాణం, నాణ్యమైన సేవలు అందించడంతో పాటు స్థానిక యువతకు

మిగతా వివరాలు రెండో పేజీలో..

# ఉగ్రవాదంపై భారత్ జీరో టాలరెన్స్

- మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ స్పష్టీకరణ
- సర్జికల్ స్ట్రైక్‌కు పదేళ్లు..
- ఉగ్రవాదానికి దీటైన సమాధానం



న్యూఢిల్లీ: ఉగ్రవాదంపై భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదులు భారత్‌పై దాడులకు పాల్పడితే వారికి దీటైన సమాధానం ఉంటుందని పేర్కొన్నారు.

మిగతా వివరాలు రెండో పేజీలో..

# బీజేపీ టికెట్ ఇస్తానన్నారా..?

## జ్ఞానేష్ కుమార్‌పై మాజీ సీఎస్ సంచలన ఆరోపణలు

**2016లోనే రాజకీయాల్లోకి రావాలని సూచించారన్న జీజీ థామ్సన్**

**పత్తనంతిట్ట నుంచి 2019లో పోటీ చేయాలని ప్రతిపాదన!**

**రెండు దశాబ్దాల నాటి ఆత్మహత్య లేఖనూ తెరపైకి తెచ్చిన థామస్ ఐజాక్**



తిరువనంతపురం: దేశ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై రాజకీయ దుమారం కొనసాగుతున్న వేళ కేరళ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జీజీ థామ్సన్ చేసిన తాజా వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తాను ప్రభుత్వ సర్వీసులో కొనసాగుతున్న సమయంలోనే జ్ఞానేష్ కుమార్ తనను బీజేపీ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని సూచించారని థామ్సన్

మిగతా వివరాలు రెండో పేజీలో..

# వచ్చే ఏడాది గిన్నిస్ రికార్డు లక్ష్యంగా బతుకమ్మ సంబురాలు

హైదరాబాద్: వచ్చే ఏడాది రెండున్నర లక్షల మందితో బతుకమ్మ వేడుకలు నిర్వహించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించేలా కార్యాచరణ చేపడుతున్నట్లు తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ సంబురాల పోస్టర్‌తో పాటు బతుకమ్మ పాటల సీడీని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ




మిగతా వివరాలు రెండో పేజీలో..

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలతో పాటు విదేశాల్లోనూ ఈ ఏడాది బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# నోయిడాలో రాష్ట్రీయ ఆయుష్ మహోత్సవ్ ముగింపు

## ముఖ్య అతిథిగా తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



మిగతా వివరాలు రెండో పేజీలో..

# గౌహతిలో ఉద్రిక్తత.. సీజేపీ కో-కన్వీనర్ అశుతోశ్ రాంకా పోలీసుల అదుపులోకి!




గౌహతి (అస్సాం) అస్సాం రాజధాని గౌహతి నగరంలో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం, రాజకీయ సంక్షోభం నెలకొంది. ఇటీవల ప్రాంతీయ, సామాజిక సమస్యలపై వరుస ప్రచారాలతో వార్తల్లో నిలుస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కో-కన్వీనర్, ముఖ్య ప్రతినిధి అశుతోశ్ రాంకాతో పాటు ఆయన బృందాన్ని అస్సాం పోలీసులు

మిగతా వివరాలు రెండో పేజీలో..

# 8 వేల ఎకరాల భూమిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

## సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ



మిగతా వివరాలు 3వ పేజీలో..

TGTEL/25/A0871
తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU



## ప్రపంచ పర్యాటక పటంలో తెలంగాణకు ఉన్నత స్థానం

ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని సీఎం అన్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించి తెలంగాణను దేశంలో ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.
పర్యాటక రంగ అభివృద్ధిలో స్థానిక ప్రజలు, హోటళ్లు, ట్రావెల్ ఏజెన్సీలు, పర్యాటక రంగ సంస్థలు, కళాకారులు, హస్తకళాకారులు, యువత భాగస్వామ్యం కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ వారసత్వాన్ని కాపాడుకుంటూ, ప్రకృతిని పరిరక్షిస్తూ, స్థానిక సంస్కృతికి గౌరవం ఇస్తూ స్థిరమైన పర్యాటక అభివృద్ధిని సాధించాలని పిలుపునిచ్చారు.తెలంగాణకు వచ్చే ప్రతి పర్యాటకుడికి ఆత్మీయ స్వాగతం పలుకుతూ రాష్ట్ర ప్రత్యేకతలను ప్రపంచానికి చాటాలని సీఎం ఆకాంక్షించారు. తెలంగాణను ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దే ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

## ఉగ్రవాదంపై భారత్ జీరో టాలరెన్స్

ఆదివారం నిర్వహించిన 138వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని పలు జాతీయ, సామాజిక అంశాలను ప్రస్తావించారు.
2016 సెప్టెంబర్ 28, 29 తేదీల్లో భారత సైన్యం నియంత్రణ రేఖ దాటి ఉగ్రవాద స్థావరాలపై నిర్వహించిన సర్జికల్ స్ట్రైక్‌కు పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆ ఆపరేషన్‌ను ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఉగ్రవాదంపై పోరాటంలో సర్జికల్ స్ట్రైక్ ప్రపంచానికి భారత్ కొత్త విధానాన్ని చాటిచెప్పిందని అన్నారు. బాలాకోట్ వైమానిక దాడి నుంచి ఆపరేషన్ సిందూర్ వరకు భారత్ ఉగ్రవాదంపై తన వైఖరిని స్పష్టంగా వెల్లడించిందని పేర్కొన్నారు. దేశంలో గతంలో ఉగ్రదాడులు జరిగిన ప్రతిసారీ పాకిస్థాన్‌పై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వచ్చినా అవి తగిన స్థాయిలో పట్టించుకోలేదని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానం ఫలితాలను చూపుతోందని అన్నారు. 2008 ఢిల్లీ వరుస పేలుళ్లను, ముంబై 26/11 ఉగ్రదాడిని కూడా ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.
జనగణనలో ప్రజల భాగస్వామ్యం కీలకంల
దేశంలో జరుగుతున్న జనగణనను కూడా ప్రధాని ప్రస్తావించారు. దేశ భవిష్యత్ ప్రణాళికలకు ఖచ్చితమైన సమాచారం అవసరమని, ప్రతి కుటుంబం తమ వివరాలను సక్రమంగా నమోదు చేయాలని కోరారు. మొబైల్ ద్వారా స్వీయ వివరాల నమోదు చేసుకునే సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. తొలి దశ జనగణన ప్రక్రియ దాదాపు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పూర్తికావస్తోందని తెలిపారు.
అశోక్ సింఘాల్‌కు నివాళి
సెప్టెంబర్ 27న మాజీ విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు అశోక్ సింఘాల్ శతజయంతి సందర్భంగా ప్రధాని ఆయనను స్మరించుకున్నారు. 1926 సెప్టెంబర్ 27న ఆగ్రాలో జన్మించిన సింఘాల్ సంస్కృతి, సమాజం, దేశం కోసం జీవితాన్ని అంకితం చేశారని మోదీ పేర్కొన్నారు.
పోషకాహారంపై ప్రత్యేక దృష్టి
సెప్టెంబర్ నెలను పోషణ మాసంగా ప్రస్తావిస్తూ దేశవ్యాప్తంగా పోషకాహార లోపాన్ని ఎదుర్కొనేందుకు జరుగుతున్న కార్యక్రమాలను ప్రధాని అభినందించారు. ఛత్తీస్‌గఢ్‌లో 'హర్ ఘర్ మున్గా--ఘర్ ఘర్ మున్గా' కార్యక్రమం ద్వారా మునగను ఆహారంలో భాగం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను, గుజరాత్‌లో చిరుధాన్యాలతో వంటకాల పోటీలను ఆయన ప్రస్తావించారు.పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, ప్రకృతి సంరక్షణకు సంబంధించి దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలను కూడా మోదీ ప్రస్తావించారు. థాయ్‌లాండ్‌లో వినాయకుడి ఆరాధనకు ఉన్న ప్రత్యేకతను, ఆంధ్రప్రదేశ్‌లో పురాతన బావులు, కోనేరుల పునరుద్ధరణ కార్యక్రమాలను కూడా తన ప్రసంగంలో ప్రస్తావించినట్లు నివేదికలు వెల్లడించాయి

## బీజేపీ టికెట్ ఇస్తానన్నారా..?



వెల్లడించారు. 2016లో ఢిల్లీకి విమానంలో ప్రయాణిస్తున్న సమయంలో ఈ ప్రతిపాదన వచ్చినట్లు ఆయన తెలిపారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కేరళలోని పత్తనంతిట్ట నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తే భవిష్యత్తులో కేంద్ర మంత్రిగా అవకాశం దక్కవచ్చని జ్ఞానేష్ కుమార్ సూచించినట్లు థామ్సన్ పేర్కొన్నారు. తాను మాత్రం ఆ ప్రతిపాదనను వెంటనే తిరస్కరించినట్లు చెప్పారు. ఈ విషయాన్ని థామ్సన్ స్థానిక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.
జీజీ థామ్సన్ 1980 బ్యాచ్‌కు చెందిన కేరళ కేడర్ ఐఏఎస్ అధికారి. 2015-16లో కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఆయన 2016లో పదవీ విరమణ చేశారు. తనకు, జ్ఞానేష్ కుమార్‌కు అప్పట్లో స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని థామ్సన్ తెలిపారు. పదవీ విరమణ తర్వాత ఏం చేయాలనుకుంటున్నారని జ్ఞానేష్ కుమార్ అడిగిన సందర్భంలోనే రాజకీయాల్లోకి రావాలన్న సూచన చేసినట్లు ఆయన వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై జ్ఞానేష్ కుమార్ అప్పట్లో ప్రశంసలు వ్యక్తం చేశారని కూడా థామ్సన్ చెప్పినట్లు పలు మీడియా సంస్థలు నివేదించాయి.
ఈ వ్యాఖ్యలు వెలుగులోకి రావడం వెనుక ప్రస్తుత ఎన్నికల సంఘంపై కొనసాగుతున్న రాజకీయ వివాదం కూడా ప్రధాన కారణంగా మారింది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)కు సంబంధించి ఎన్నికల సంఘం నిర్ణయాలపై విపక్షాలు ఇప్పటికే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి కొన్ని నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ వచ్చిన వార్తలు కూడా ఈ వివాదాన్ని మరింత పెంచాయి. అయితే ఎన్నికల సంఘం మాత్రం ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఏకాభిప్రాయంతోనే జరిగాయని స్పష్టం చేసింది.
రెండు దశాబ్దాల నాటి వ్యవహారం మళ్లీ తెరపైకి
ఇదే సమయంలో సీపీఎం సీనియర్ నేత, మాజీ కేరళ ఆర్థిక మంత్రి టీఎం థామస్ ఐజాక్ మరో పాత వ్యవహారాన్ని ప్రస్తావించారు. దాదాపు 20 ఏళ్ల క్రితం కేరళలోని ప్రజా పనుల శాఖకు సంబంధించిన రహదారి ప్రాజెక్టులో పనిచేసిన మలేషియా అధికారి లీ బీన్ సీన్ ఆత్మహత్య లేఖలో అప్పటి పీడబ్ల్యూడీ కార్యదర్శిగా ఉన్న జ్ఞానేష్ కుమార్ పేరు ప్రస్తావించబడిందని ఐజాక్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.
మలేషియాకు చెందిన సంస్థ, భారత కాంట్రాక్టర్ కలిసి చేపట్టిన రహదారి ప్రాజెక్టుకు సంబంధించిన కార్యకలాపాలను లీ బీన్ సీన్ పర్యవేక్షించారని ఐజాక్ వివరించారు. 2006 నవంబర్‌లో కౌలాలంపూర్‌లో లీ ఆత్మహత్య చేసుకున్నారని, తన లేఖలో ప్రజా పనుల శాఖ అధికారులపై వేధింపులు, అవినీతి, అవకతవకలకు సంబంధించిన ఆరోపణలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆ లేఖలో జ్ఞానేష్ కుమార్ పేరు కూడా ఉన్నట్లు ఐజాక్ వెల్లడించారు. ఈ ఆరోపణలపై అప్పట్లో విజిలెన్స్ విచారణ జరిగిందని, అనంతరం జ్ఞానేష్ కుమార్‌ను పీడబ్ల్యూడీ నుంచి బదిలీ చేసినట్లు ఆయన తెలిపారు. అయితే ఈ వ్యవహారం రెండు దశాబ్దాల క్రితం నాటిదని, అప్పటి విచారణ రికార్డులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయా లేదా అన్నది తనకు తెలియదని ఐజాక్ పేర్కొన్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి.
అయితే ఆత్మహత్య లేఖలో పేరు ప్రస్తావించబడటం లేదా అప్పటి ఆరోపణలు ఉండటం మాత్రమే జ్ఞానేష్ కుమార్‌పై నేరం నిరూపితమైనట్లు భావించలేం. ఈ అంశంపై తాజా అధికారిక దర్యాప్తు లేదా తుది న్యాయపరమైన నిర్ణయం ఏమిటన్నది స్పష్టంగా నిర్ధారించాల్సి ఉంది.
ప్రస్తుతం ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉన్న జ్ఞానేష్ కుమార్‌పై మాజీ సీఎస్ చేసిన రాజకీయ ప్రతిపాదన ఆరోపణ ఒకవైపు, రెండు దశాబ్దాల నాటి పీడబ్ల్యూడీ వ్యవహారాన్ని థామస్ ఐజాక్ తిరిగి ప్రస్తావించడం మరోవైపు ఉండటంతో ఈ అంశం జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. జీజీ థామ్సన్ చేసిన ఆరోపణలపై జ్ఞానేష్ కుమార్ నుంచి ఇప్పటివరకు స్పందన వెలువడలేదని తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

## వచ్చే ఏడాది గిన్నిస్ రికార్డు లక్ష్యంగా

## బతుకమ్మ సంబురాలు

బతుకమ్మ వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటేందుకు వచ్చే ఏడాది భారీ స్థాయిలో వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు. గ్రామ గ్రామాన బతుకమ్మ, కోలాటం కమిటీలను ఏర్పాటు చేసి మహిళలను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేస్తామని పేర్కొన్నారు. గతంలో బతుకమ్మ వేడుకల ద్వారా గిన్నిస్ రికార్డు సాధించేందుకు ప్రయత్నాలు జరిగినా అవి సఫలం కాలేదని, ఈసారి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతామని తెలిపారు. బూర్జ్ ఖలీఫాతో పాటు ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో బతుకమ్మ వైభవాన్ని చాటిన తెలంగాణ జాగృతి ద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని అన్నారు.
తెలంగాణ సాంస్కృతిక వికాసం, మహిళా సాధికారతతో పాటు సమాజంలోని అసమానతలను రూపుమాపే లక్ష్యంతో తెలంగాణ జాగృతిని మరింత విస్తృతంగా బలోపేతం చేయనున్నట్లు కవిత తెలిపారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి సాంస్కృతిక చైతన్యానికి వేదికగా నిలిచిన జాగృతి ఇకపై తెలంగాణ సమాజం కోసం మరింత విస్తృత కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్ర కమిటీతో పాటు పలు జిల్లాలు, వివిధ దేశాలకు నూతన కమిటీలను ప్రకటించారు. మిగిలిన జిల్లాల కమిటీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.
బతుకమ్మ పాటలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో చప్పట్ల పాటలు, సంప్రదాయ బతుకమ్మ పాటలతో సీడీ రూపొందించినట్లు కవిత వివరించారు. ఈ ఏడాది జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ సంబురాల్లో తెలంగాణ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.
తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు మారిపెల్లి మాధవి మాట్లాడుతూ వచ్చే ఏడాది రెండున్నర లక్షల మందితో బతుకమ్మ నిర్వహించి గిన్నిస్ రికార్డు సాధించే లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది అన్ని జిల్లాల్లో జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటికే చప్పట్ల, సంప్రదాయ బతుకమ్మ పాటలను యూట్యూబ్‌లో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు.
తెలంగాణ జాగృతి రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలిగా మారిపెల్లి మాధవి, ఉపాధ్యక్షులుగా జాడి శ్రీనివాస్, పర్శ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా గుంటి సుందర్, కార్యదర్శులుగా కన్నం శారద, దొండి స్వర్ణలత, మస్తాన్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా మానుకోట సునీతను నియమించారు. జగిత్యాల అధ్యక్షుడిగా పట్టూరి తిరుపతి, రంగారెడ్డి ఎండీ మొయినుద్దీన్, వరంగల్ పొలుదాసరి రమేశ్, హన్మకొండ నెట్టి రజిత, మహబూబ్‌నగర్ ఏర్పుల నర్సింలు, సూర్యాపేట లక్కపాక ప్రవీణ్, భూపాలపల్లి గుమ్మడి రవీందర్, నిజామాబాద్ అవంతి కుమార్, పెద్దపల్లి మేడారపు రాజ్యలక్ష్మీ, కరీంనగర్ గుండు మంజుల, కామారెడ్డి రెడ్డిపేట సతీశ్ కుమార్‌లను నియమించారు. మహారాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా వేణుగోపాల్ యాదవ్‌ను ప్రకటించారు.
విదేశీ శాఖల్లో న్యూజిలాండ్ అధ్యక్షురాలిగా ముద్దం అరుణ జ్యోతి, ఖతార్ అధ్యక్షురాలిగా ప్రవీణ లక్ష్మీ, ప్రధాన కార్యదర్శిగా ఆదర్శ రెడ్డి పోతుల, అమెరికా అధ్యక్షుడిగా రాజ్ గోవిల్కర్, ఓమన్ అధ్యక్షుడిగా గుండు రాజేందర్ నేత, కెనడా అధ్యక్షుడిగా కుందె రాఘవేంద్ర యాదవ్, ఐర్లాండ్ అధ్యక్షుడిగా సంతోష్ పల్లె, స్విట్జర్లాండ్ అధ్యక్షుడిగా కిశోర్ తాటికొండ, ఇటలీ అధ్యక్షురాలిగా సౌమ్య పిన్నంరెడ్డి, నార్వే అధ్యక్షుడిగా కిరణ్ తేజ సూధటి, ప్రధాన కార్యదర్శిగా నిఖిత బిల్లకంటి, జింబాబ్వే అధ్యక్షుడిగా శ్రావణ్ కుమార్ గౌడ్, కెన్యా అధ్యక్షురాలిగా గంట్ల స్వప్నా రెడ్డిని నియమించారు

## నోయిడాలో రాష్ట్రీయ ఆయుష్ మహోత్సవ్ ముగింపు

నోయిడా: ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో నిర్వహించిన రాష్ట్రీయ ఆయుష్ మహోత్సవ్ ముగింపు వేడుకలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు సెక్టార్-62లోని ఇంటర్నేషనల్ ట్రేడ్ ఎక్స్‌పో సెంటర్‌లో ఆయుర్వేద వైద్య ఎడ్యుహెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ మహోత్సవాన్ని నిర్వహించారు.
మూడు రోజుల పాటు జరిగిన ఈ మహోత్సవంలో ఆయుష్ వైద్య విధానాలపై అవగాహన కల్పించడంతో పాటు భారతీయ సంప్రదాయ వైద్య విజ్ఞానం, ఆరోగ్య పరిరక్షణలో దాని ప్రాధాన్యతను ప్రజలకు వివరించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయుర్వేదం సహా సంప్రదాయ వైద్య విధానాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వాటి ప్రయోజనాలను విస్తృతంగా చాటిచెప్పడం మహోత్సవం ప్రధాన ఉద్దేశంగా నిలిచింది.
ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆయుష్ రంగానికి సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భారతీయ వైద్య సంప్రదాయాల ప్రాధాన్యతను చాటిచెప్పే కార్యక్రమాలు దేశవ్యాప్తంగా మరింత విస్తృతం కావాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆయుష్ రంగానికి చెందిన వైద్యులు, నిపుణులు, సంస్థల ప్రతినిధులు, ప్రజలు మహోత్సవంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. సంప్రదాయ వైద్య విజ్ఞానాన్ని ఆధునిక ఆరోగ్య విధానాలతో అనుసంధానిస్తూ ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు.

## గౌహతిలో ఉద్రిక్తత.. సీజేపీ కో-కన్వీనర్ అశుతోశ్ రాంకా పోలీసుల అదుపులోకి!

ఆకస్మికంగా అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామంతో నగరవ్యాప్తంగా ఒక్కసారిగా పరిస్థితులు వేడెక్కాయి.
వాలంటీర్ల సమావేశానికి అడ్డుకట్ట:
అస్సాంలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ఈశాన్య రాష్ట్రాల పరిధిలో ఉన్న వివిధ సమస్యలపై చర్చించేందుకు సీజేపీ అధిష్టానం గౌహతిలోని ఒక కొండ ప్రాంత వేదిక వద్ద భారీ వాలంటీర్ల సమావేశానికి పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు అస్సాం నలుమూలల నుంచే కాకుండా నాగాలాండ్ సహా ఇతర పొరుగు రాష్ట్రాల నుంచి కూడా సుమారు 200 నుండి 300 మంది దాకా వాలంటీర్లు, కార్యకర్తలు గౌహతికి చేరుకున్నారు. అయితే సదస్సు ప్రారంభం కావడానికి కొద్ది సమయం ముందే ఘటనా స్థలానికి చేరుకున్న అస్సాం పోలీసులు భారీ బారికేడ్లను ఏర్పాటు చేసి, టియర్ గ్యాస్ వాహనాలను మోహరించారు. వేదికకు వస్తున్న ప్రతి ఒక్కరినీ అడ్డుకుంటూ వెనక్కి పంపించివేశారు. అనంతరం అక్కడ ఉన్న అశుతోశ్ రాంకాతో పాటు ప్రేమ్ ఆకాశ్, అంకిత్ భరద్వాజ్, ఖార్గేశ్వర్ మిల్లీ, షేక్ సాహిలుద్దీన్ షా, హితేష్ బరువా, మింటూ దాస్, టామీ బరువా వంటి కీలక నాయకులను బలవంతంగా పోలీసు వాహనాల్లోకి తరలించారు.
పోలీస్ బస్సులోకి తరలిస్తున్న సమయంలో అశుతోశ్ రాంకా మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. "రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు ఎంత దారుణమైన స్థితిలో ఉన్నాయో, 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారం ద్వారా ఆ అసలు వాస్తవాలను తాము బయటపెడతామనే భయంతోనే ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తమను అక్రమంగా అడ్డుకుంటున్నారు" అని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. సీఎం హిమంత బిశ్వశర్మ భయపడిన ప్రతిసారీ పోలీసులను ముందుంచుకుని ప్రజాస్వామ్య బద్ధంగా జరిగే కార్యక్రమాలను అణచివేస్తున్నారని విమర్శించారు.
అంతేకాకుండా, ప్రపంచ ప్రసిద్ధి చెందిన కాజిరంగ జాతీయ పార్కు పరిసర ప్రాంతాల్లో గిరిజనులు, స్థానికుల హక్కులను ప్రభుత్వం ఏవిధంగా కాలరాస్తోందో తాము ప్రశ్నిస్తున్నామని అన్నారు. అక్కడి పేద ప్రజలకు చెందిన భూములు, అడవులు, నీటి వనరులను బలవంతంగా లాక్కొని బడా కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఆర్) పేరుతో అనేకమంది పౌరుల పేర్లను జాబితా నుంచి తొలగించారని, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని మండిపడ్డారు. మానవ తప్పిదాల వల్ల వస్తున్న కృత్రిమ వరదల విపత్తులతో ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే, ఆ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ప్రభుత్వం తమపై అరెస్టులకు దిగిందని స్పష్టం చేశారు.
న్యాయవాదులకు నిరాకరణ -- సీజేపీ నేతల ఆగ్రహం:మరోవైపు అదుపులోకి తీసుకున్న తమ నాయకులను కలిసేందుకు వెళ్లిన న్యాయవాదులను కూడా పోలీసులు లోపలికి అనుమతించకపోవడం తీవ్ర కలకలం రేపింది. దీనిపై సీజేపీ జాతీయ కన్వీనర్ అభీజీత్ దీప్కే స్పందిస్తూ.. రాంకాను, ఇతర నేతలను ఏ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారో కూడా చెప్పకుండా రహస్య ప్రాంతాలకు తరలిస్తున్నారని, ఇది పూర్తి రాజ్యాంగ విరుద్ధమైన చర్య అని పేర్కొన్నారు. శాంతియుతంగా

## గుడిలో నిశ్శబ్దంగా నిలబడితే..

# మనసులోని మాట ఎందుకు వినిపిస్తుంది?

దేవాలయంలోకి వెళ్లినప్పుడు బయట ప్రపంచం ఒక్కసారిగా దూరమైనట్టుగా అనిపిస్తుంది. బయట ఎంత శబ్దం ఉన్నా.. గర్భగుడి ముందు నిలబడిన కొన్ని క్షణాల్లో మాత్రం మనసు నిశ్శబ్దంగా మారుతుంది. దేవుడి రూపాన్ని చూస్తూ ఏమీ మాట్లాడకుండా అలాగే నిలబడిపోతాం. ఆ నిశ్శబ్దంలోనే మనకు మనమే ఎన్నో ప్రశ్నలు వేసుకుంటాం. అసలు గుడిలో మౌనంగా నిలబడటానికి ఇంత ప్రత్యేకత ఎందుకు? మనిషి రోజంతా ఎన్నో మాటలు మాట్లాడుతాడు. ఇతరుల సమస్యలు వింటాడు. తన సమస్యలు చెబుతాడు. ఫోన్, పనులు, బాధ్యతలు, పరుగులు.. ఇలా మనసుకు విశ్రాంతి దొరకడం చాలా కష్టం. కానీ దేవుడి సన్నిధిలో కొన్ని క్షణాలు మౌనంగా ఉన్నప్పుడు బయట ప్రపంచం కంటే మన అంతరంగం మనకు ఎక్కువగా వినిపిస్తుంది.

అందుకే దేవాలయంలో మౌనం కేవలం శబ్దం చేయకపోవడం కాదు.. మనసును మన వైపు తిప్పుకోవడం. మనం ఎక్కడ తప్పుతున్నాం? ఎవరినైనా బాధించామా? అనవసరంగా కోపం తెచ్చుకున్నామా? ఎవరికైనా సహాయం చేయాల్సి ఉందా? అనే ఆలోచనలు కూడా ఆ మౌనంలో మనసుకు తట్టవచ్చు.

దేవుడి ముందు నిలబడి కోరికలు చెప్పడం భక్తి అయితే.. కొన్ని క్షణాలు ఏమీ అడగకుండా దేవుడిని చూస్తూ ఉండటం కూడా ఒక రకమైన ఆత్మపరిశీలన. ఎందుకంటే ప్రతి సమస్యకు సమాధానం బయట దొరకదు. కొన్ని సమాధానాలు మనలోనే ఉంటాయి. వాటిని వినడానికి కొంత నిశ్శబ్దం అవసరం.

అందుకే రేపు దేవాలయానికి వెళ్లినప్పుడు ఒకసారి ప్రయత్నించండి. దేవుడి ముందు నిలబడి వెంటనే కోరికలు చెప్పకుండా.. కాసేపు కళ్లను దేవుడి రూపంపై నిలిపి, మనసును ప్రశాంతంగా ఉంచండి. ఆ తర్వాత మీలో వచ్చిన ఒక్క మంచి ఆలోచనను గుర్తుంచుకోండి. అది మీకు ఆ రోజు తీసుకోవాల్సిన ఒక మంచి నిర్ణయానికి దారి చూపవచ్చు.

గుడిలో వెలిగే దీపం చీకటిని తొలగిస్తుంది. గంట శబ్దం మన దృష్టిని కేంద్రీకరిస్తుంది. కానీ మౌనం.. మనలోని చీకటిని మనకే చూపిస్తుంది. అందుకే దేవుడి సన్నిధిలో కొన్ని క్షణాల మౌనం కూడా ఒక ప్రార్థనే.

దేవుడి ముందు మాట్లాడటానికి మాటలు అవసరం లేదు.. నిజమైన మనసుంటే చాలు. కొన్నిసార్లు మనం దేవుడితో మాట్లాడటం కంటే.. ఆయన ముందు మౌనంగా నిలబడినప్పుడే మనసు మనతో మాట్లాడటం మొదలుపెడుతుంది.



సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

# శబ్ద అరాచకం భక్తి ఎలా అవుతుంది?

## గణేశ ఉత్సవాల్లో ఆర్భాటాల ఘర్షణ

## చట్టం, ధర్మం మధ్య నలిగిపోతున్న సామాజిక సమరసత

ఏ పండుగైనా మనిషిలోని ఆంతరంగిక శోధనకు, సామాజిక సమరసతకు, సమాజ శ్రేయస్సుకు ఒక దివ్యమైన మార్గం. శతాబ్దాలుగా భారతీయుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక జీవితంలో గణేశ ఉత్సవాలకు ఒక అత్యున్నత ప్రాధాన్యత ఉంది. ఒకప్పుడు కేవలం ఇళ్లకే పరిమితమైన పూజలను, స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో లోకమాన్య బాల్ గంగాధర్ తిలక్ పిలుపుతో ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే మహోన్నత సామాజిక శక్త్యాలంబనగా వీధి గణపతుల ఉత్సవాలు రూపాంతరం చెందాయి. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఐక్యతను చాటడానికి రూపుదిద్దుకున్న ఈ సామాజిక వేదికలు, స్వతంత్ర భారతంలో మత సామరస్యానికి, సంస్కృతి పరిరక్షణకు, యువతలో సేవాభావాన్ని పెంపొందించడానికి ఎంతో దోహదపడ్డాయి. కానీ, గత కొన్ని దశాబ్దాలుగా ఈ పండుగ నిర్వాహక స్వరూపంలోకి చొరబడిన కొన్ని ఆధునిక వైపరీత్యాలు, ఆర్భాటాలు పండుగ యొక్క అసలు ఆత్మను, పరమార్థాన్ని దెబ్బతీస్తుండటం నేడు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న అంశం. భక్తి స్థానంలో శబ్ద హోరు, సంప్రదాయ ఆచారాల స్థానంలో రికార్డ్ డాన్సులు, ఆధ్యాత్మిక ఆలోచనల స్థానంలో వీధి పోరాటాలు వచ్చి చేరడం సమాజ ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు.

ఏ మతంలోనైనా, ఏ ధర్మశాస్త్రంలోనైనా, చివరకు ఏ వేద ఉపనిషత్తుల్లోనైనా తీవ్రమైన శబ్ద కాలుష్యాన్ని సృష్టించే డీజేల హోరు గానీ, అశ్లీలతకు తావిచ్చే రికార్డ్ డాన్సులు గానీ మతాచారంలో భాగమని ఎక్కడా పేర్కొనలేదు. సనాతన సంప్రదాయం ఎల్లప్పుడూ మంగళ వాయిద్యాలను, ప్రశాంతమైన భజనలను, నామస్మరణను, శ్రోతల మనసుకు ఆహ్లాదాన్ని ఇచ్చే వాతావరణాన్ని మాత్రమే ప్రోత్సహించింది. మంగళ వాద్యాలు, డప్పు చప్పుళ్లు, భక్తి పాటలు పండుగ వాతావరణానికి ఒక ప్రత్యేకమైన కళను, ఉత్సాహాన్ని ఇస్తాయి. కానీ నేడు పండుగ మంటపాల వద్ద శబ్ద



పరిమితులను పూర్తిగా తుంగలో తొక్కి, భారీ సౌండ్ సిస్టమ్‌లు, డీజేలు మోగించడం, ఆ శబ్ద హోరునే తమ ఉత్సవ విజయాకి కొలమానంగా భావించడం ఒక విపరీతమైన పోకడగా మారింది. అసలు డీజేలు, రికార్డ్ డాన్సులు లేకపోతే హిందూ ధర్మం గానీ, వినాయక ఉత్సవాల శోభ గానీ తగ్గిపోతుందా? అని ఆలోచిస్తే, ఖచ్చితంగా లేదనే సమాధానం వస్తుంది. నిజమైన భక్తి అనేది ఆర్భాటపు శబ్దంలో ఉండదు; అది మనిషి అంతరంగంలో ఉత్పన్నమయ్యే నిశ్చల భావంలో ఉంటుంది.

దీని పరిణామాలు కేవలం సాంస్కృతిక దిగజారుడుకే పరిమితం కాకుండా, సామాన్య ప్రజల ప్రాణాల మీదకు వస్తున్నాయి. పరిమితికి మించిన సౌండ్ డెసిబెల్స్ మానవ ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తాయని వైద్య నిపుణులు నిరంతరం హెచ్చరిస్తూనే ఉన్నారు. తీవ్రమైన శబ్దాల వల్ల చిన్నపిల్లలు, గర్భిణులు, వృద్ధులు మరియు ముఖ్యంగా గుండె జబ్బులు ఉన్నవారు తీవ్ర భయాందోళనలకు, అసౌకర్యానికి గురవుతున్నారు. ఇటీవలి కాలంలో వివిధ ప్రాంతాల్లో నిమజ్జన ఊరేగింపుల్లో మోగించిన డీజేల శబ్దాల తాకిడికి గుండె స్పందన మందగించి, అక్కడిక్కడే గుండెపోటు వచ్చి ప్రాణాలు కోల్పోయిన యువకులు, వృద్ధుల విషాదకర సంఘటనలు అనేక వార్తల్లో చూశాం. ఒకరి భక్తి లేదా తాత్కాలిక వినోద ఉత్సాహం ఇంకొకరి ప్రాణాలకు ముప్పుగా, శాపంగా మారినప్పుడు, దానిని అసలైన భక్తి అని ఎలా పిలవగలం? భక్తి పేరుతో ఇతరులకు హాని కలిగించడం ఏ మత ధర్మానికి కూడా అమోదయోగ్యం కాదు.

ఈ తీవ్రమైన ఆరోగ్య ముప్పును, పెరిగిపోతున్న శబ్ద కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకునే భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు రాత్రి వేళల్లో పెద్ద శబ్దాలపై, అలాగే నిర్ణీత పరిమితికి మించిన డీజేలపై స్పష్టమైన ఆంక్షలు విధించింది. కోర్టు ఉత్తర్వులను క్షేత్రస్థాయిలో అమలు చేయడం, ప్రజల ప్రాణాలను కాపాడడం, పట్టణాల్లో శాంతిభద్రతలను పర్యవేక్షించడం చట్ట అమలు సంస్థలైన పోలీసుల ప్రాథమిక బాధ్యత. అయితే, నిబంధనలను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్న అధికారులపై, పోలీసులపై మతం పేరిట తిరగబడటం, వారి విధుల అడ్డుకోవడం, తోపులాటలకు దిగడం తీవ్ర విచారకరం. సమాజంలో ఉగ్రవాదాన్ని, అశాంతిని, నేరాలను మట్టుబెట్టడానికి రాత్రింబవళ్లు శ్రమించే పోలీసు వ్యవస్థకు మద్దతుగా నిలవాల్సిన బాధ్యతాయుత పౌరులే, నిబంధనల ఉల్లంఘనను ప్రశ్నించినందుకు వారితో ఘర్షణలకు దిగడం ఎంతవరకు సమంజసం? పోలీసులను తమ మతానికి లేదా సంప్రదాయాలకు వ్యతిరేకులుగా చిత్రీకరించే ప్రయత్నం అత్యంత ప్రమాదకరమైన భావజాలం. వారు అమలు చేస్తున్నది ఏ ఒక్క నిర్దిష్ట మతానికో వ్యతిరేకమైన చట్టం కాదు; సమాజంలోని సాధారణ పౌరులందరి నిశ్శబ్ద వాతావరణంలో జీవించే హక్కును కాపాడే రాజ్యాంగబద్ధమైన చట్టం.

సంప్రదాయం పేరిట చట్టాన్ని ఉల్లంఘించడమే తమ హక్కు అని భావించడం, పండుగల పేరుతో రోడ్లపై అల్లర్లు సృష్టించడం వల్ల ధర్మానికి లేదా సమాజానికి ఏమాత్రం గౌరవం రాదు. ఉగ్రవాదంపై పోరులో భద్రతా దళాలకు సహకరించే సమాజం, అంతర్గతంగా చట్టబద్ధమైన పాలనకు కూడా అంతే మద్దతు ఇవ్వాలి.

పండుగలు మనలో ఐక్యతను, పరస్పర గౌరవాన్ని, సహనాన్ని, నిగ్రహాన్ని పెంచాలి తప్ప విభాజక భావాలను, రాత్రివేళల్లో అశాంతిని వ్యాప్తి చేయకూడదు. ఇప్పటికైనా ఉత్సవ నిర్వాహకులు, యువత యథార్థాన్ని గ్రహించాలి. శబ్ద హోరులు, ఆర్భాటపు అశ్లీల వినోదాలు గణేశ ఉత్సవాల ఆత్మను తీవ్రంగా దెబ్బతీస్తాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను గౌరవిస్తూ, పర్యావరణ అనుకూలమైన మట్టి గణపతులను పూజిస్తూ, సంప్రదాయ వాయిద్యాలతో ప్రశాంతంగా, శాంతియుతంగా వేడుకలు జరుపుకోవడమే విఘ్నేశ్వరునికి మనం ఇచ్చే నిజమైన ఆధ్యాత్మిక నివేదన. పోలీసులు విధించే నిబంధనలను గౌరవిస్తూ, సమాజ క్షేమానికి కట్టుబడి ఉన్నప్పుడే మన భక్తికి, ధర్మానికి పూర్తి సార్థకత చేకూరుతుంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# 8 వేల ఎకరాల భూమిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

హైదరాబాద్: రాజన్న సిరిసిల్ల జిల్లాలో 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ధరణి పోర్టల్ ద్వారా వివిధ వ్యక్తులకు బదలాయించబడిందంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలపై పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. సిరిసిల్ల పర్యటనకు సీఎం సిద్ధమవుతున్న నేపథ్యంలో కేటీఆర్ లేఖ రాయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

సిరిసిల్లలో 8 వేల ఎకరాల భూమి కబ్జాకు గురైందని ముఖ్యమంత్రి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ లేఖలో ప్రస్తావించారు. ఆరోపణలు నిజమైతే వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు. ఏ గ్రామాల్లో భూములు ఉన్నాయో, ఆయా భూములకు సంబంధించిన సర్వే నంబర్లు ఏమిటో, ఎవరి పేర్లకు బదలాయింపు జరిగిందో, ఎప్పుడు బదలాయించారో, ప్రస్తుతం ఆ భూముల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వద్ద ఆరోపణలకు సంబంధించిన రికార్డులు, ఆధారాలు ఉంటే వాటిని దాచాల్సిన అవసరం లేదని కేటీఆర్ పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం కింద సంబంధిత వివరాలు కోరినప్పుడు కూడా ప్రభుత్వం పూర్తి సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. 8 వేల ఎకరాలకు సంబంధించిన భూముల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడంతో పాటు, వాటిపై జరిగిన చర్యలు, రికవరీ వివరాలను కూడా వెల్లడించాలని కోరారు.

ఆరోపణలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. శ్వేతపత్రంలో భూముల వివరాలు, సర్వే నంబర్లు, సంబంధిత వ్యక్తుల పేర్లు, భూముల స్వరూపం, ప్రభుత్వ భూమిగా గుర్తించిన ఆధారాలు, ఇప్పటివరకు తీసుకున్న చర్యలను స్పష్టంగా పేర్కొనాలని కోరారు. ఆరోపణలను రుజువు చేసే ఆధారాలను ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలని అన్నారు.

మరోవైపు ఆరోపణలను ప్రభుత్వం రుజువు చేయలేకపోతే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆధారాలు లేకుండా రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. 8 వేల ఎకరాల భూమి ఎక్కడ ఉంది, ఏ సర్వే నంబర్ల పరిధిలో ఉంది, ఎవరికి బదలాయించబడింది అనే వివరాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని సవాల్ చేశారు.

సిరిసిల్ల పర్యటనకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా 8 వేల ఎకరాల ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ కోరారు. శ్వేతపత్రం విడుదల చేసిన తర్వాతే సిరిసిల్లలో అడుగుపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ నేతలు కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

ఇదిలా ఉండగా, సెప్టెంబర్ 17న తెలంగాణ అసెంబ్లీలో సెక్షన్ 22-ఏ కింద భూముల అంశంపై జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల జిల్లాలో ధరణి పోర్టల్ ద్వారా సుమారు 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమి వివిధ వ్యక్తులకు బదలాయించబడిందని ఆరోపించినట్లు నివేదికలు వెల్లడించాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణ, ధరణి ద్వారా జరిగిన భూ లావాదేవీలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీఎం పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి.

ఈ నేపథ్యంలో సీఎం చేసిన ఆరోపణలకు పూర్తి ఆధారాలు, రికార్డులు బయటపెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం పేర్కొంటున్న భూ బదలాయింపులపై అధికారిక రికార్డులు, తదుపరి విచారణలు, చర్యల వివరాలు వెలువడాల్సి ఉంది. దీంతో సిరిసిల్లలోని 8 వేల ఎకరాల అంశం మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

కేటీఆర్ తాజా డిమాండ్‌లో ప్రధానంగా 8 వేల ఎకరాలకు సంబంధించిన పూర్తి వివరాలను శ్వేతపత్రం రూపంలో ప్రజల ముందుంచడం, ఆరోపణలకు ఆధారాలు వెల్లడించడం, ఆరోపణలు రుజువు కాకపోతే సీఎం క్షమాపణ చెప్పడం వంటి అంశాలను ప్రస్తావించారు.

## జిల్లావ్యాప్తంగా ఉల్లాస్ పరీక్షకు విశేష స్పందన



నిర్మల్, సెప్టెంబర్ 27 (తెలంగాణ వెన్నెల వాక్కు): వయోజన విద్యాశాఖ, మెప్మా, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉల్లాస్ అక్షరాస్యత పరీక్షకు జిల్లావ్యాప్తంగా విశేష స్పందన లభించింది. నిర్మల్ పట్టణంలోని వైఎస్సార్ నగర్, సాయినగర్, శాంతినగర్ కేంద్రాలలో నిర్దేశించిన లక్ష్యాన్ని మించి మహిళలు పరీక్షకు హాజరయ్యారు. నిర్మల్ రూరల్ మండలం కౌట్ల (కె) ప్రాథమిక పాఠశాల కేంద్రంలో 145 మంది మహిళలు ఉత్సాహంగా పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రాలను డీఈవో దర్శనం భోజన్న, ఉల్లాస్ జిల్లా ఇన్‌ఛార్జ్ అధికారి జి. శ్రీనివాసరెడ్డి, సీఎమ్వో ప్రవీణ్ కుమార్, డీపీఎం శోభారాణి, టీఎంసీ సావిత్రి, సర్పంచ్ దూమాల రాజు పరిశీలించారు.

## నేడు నిర్మల్‌లో కాంగ్రెస్ నిరసన ర్యాలీ: కూచాడి శ్రీహరిరావు

నిర్మల్, సెప్టెంబర్ 27 (తెలంగాణ వెన్నెల వాక్కు): కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలిని నిరసిస్తూ ఆయన తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు సోమవారం నిర్మల్ పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరిరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆర్డీవో కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించి, అనంతరం సీఈసీ దిష్టిబొమ్మను దహనం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో పాటు ముఖ్య నేతలు పాల్గొంటారని, పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు నేటి తరానికి ఆదర్శం



నిర్మల్, సెప్టెంబర్ 27 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తెలంగాణ ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి సందర్భంగా మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బాపూజీ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. జీవితాంతం ప్రజాసేవకే అంకితమైన ఆయన చూపిన బాట నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



నిర్మల్, సెప్టెంబర్ 27 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని అధికారికంగా నిర్వహించారు. అధికారులు, కుల సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బాపూజీ నిజాం వ్యతిరేక పోరాటం, భారత స్వాతంత్ర్య పోరాటం, మలిదశ తెలంగాణ ఉద్యమంలో వృద్ధాప్యంలోనూ క్రియాశీలకంగా పాల్గొన్నారని వక్తలు కొనియాడారు. బడుగు వర్గాల ఉన్నతికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ఆశయ సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, సహాయ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగంతోనే భూతాపం నివారణ



నిర్మల్, సెప్టెంబర్ 27 (తెలంగాణ వెన్నెల వాక్కు):
శిలాజ ఇంధనాల మితిమీరిన వాడకంతో కర్బన ఉద్గారాలు పెరిగి భూతాపం, ఎల్‌నినో వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు షేక్ రఫీక్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక టీఎన్జీవో భవన్‌లో జేవీవీ ఆధ్వర్యంలో 'శూన్య కర్బన ఉద్గారాలు' దినోత్సవం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి గజపల్లి నర్సయ్య మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలు ఉద్గారాల నివారణకు తగిన నిధులు వెచ్చించాలన్నారు. సౌర, పవన శక్తి వంటి ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని పెంచాలని, ప్రజలు ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించాలని కోరారు. కార్యక్రమంలో మలావత్ భిక్షపతి, కొండా రాములు, అనంత్ విశ్వేశ్వర్, అంకం గంగాధర్ పాల్గొన్నారు.

# నేడు ముధోల్ ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష



ముధోల్, సెప్టెంబర్ 27 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2:30 గంటలకు మండల స్థాయి ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. మండల ప్రత్యేక అధికారి బట్టేకర్ లక్ష్మణ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మండలంలో అమలవుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీల సర్పంచులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

# ప్లాస్టిక్ రహిత గ్రామం దిశగా అష్ట ముందడుగు




ముధోల్, సెప్టెంబర్ 27 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల పరిధిలోని అష్ట గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత, పచ్చదనంతో కూడిన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామ పంచాయతీ కఠిన నిర్ణయాలు తీసుకుంది. "ప్లాస్టిక్ వాడకం తగ్గిద్దాం -- ప్రకృతిని కాపాడుదాం" నినాదంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే రూ. 500, అనుమతి లేకుండా చెట్లు నరికితే రూ. 1,000 జరిమానా విధిస్తామని పంచాయతీ పాలకవర్గం హెచ్చరించింది. ప్రజలు ప్లాస్టిక్‌కు బదులుగా గుడ్డ సంచులను వాడాలని సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

# లక్ష్మణచాందలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



లక్ష్మణచాంద, సెప్టెంబర్ 27 (తెలంగాణ వెన్నెల వాక్కు):
లక్ష్మణచాంద మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన నిస్వార్థ సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఓస కవితా రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇటల శ్రీనివాస్, పద్మశాలి సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కేసీఆర్ ప్రజల గుండెల్లో ఉన్నారు.. రెండేళ్లలో మళ్లీ మా పాలనే: కేటీఆర్

హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) ఈ రాష్ట్ర ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని, ఆయన తెచ్చిన సంక్షేమం, అభివృద్ధి ప్రతి ఇంటికీ చేరాయని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, రాబోయే రెండేళ్ల కాలంలో రాజకీయ సమీకరణాలు మారి మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న సందర్భంగా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు.
?తెలంగాణను పది సంవత్సరాల పాటు అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు, రైతుబంధు, రైతుభీమా, ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి అనేక విప్లవాత్మక సంక్షేమ పథకాలు రాష్ట్ర రూపురేఖలనే మార్చివేశాయని గుర్తుచేశారు. నాడు కేసీఆర్ అందించిన పరిపాలనతో ప్రతి వర్గానికి మేలు జరిగిందని, అందుకే ప్రజలు నేటికీ కేసీఆర్ పాలనను గుర్తుచేసుకుంటున్నారని అన్నారు.
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.
ఎన్నికల సమయంలో అమలు సాధ్యం కాని 'ఆరు గ్యారెంటీలు' మరియు వందలాది వాగ్దానాలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. నేడు ఆ హామీలను నిలబెట్టుకోలేక కాంగ్రెస్ నాయకులు చేతులెత్తేశారని, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారని ఆరోపించారు.
రైతులు, మహిళలు, యువత, కౌలుదారులు, నేత కార్మికులు ఇలా ప్రతి వర్గం ఈ ప్రభుత్వ తీరుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి విద్యుత్ కోతలు, సాగునీటి కొరత, సమయానికి మద్దతు ధర లభించకపోవడం వంటి సమస్యలు మళ్లీ మొదలయ్యాయని, ఇది కాంగ్రెస్ పాలనా రహిత వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు.
ప్రస్తుత కాంగ్రెస్ పాలనతో ప్రజలు




విసిగిపోయారని, నాటి కేసీఆర్ స్వర్ణ యుగాన్ని మళ్లీ కోరుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న పొరపాట్లను, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను బీఆర్ఎస్ శ్రేణులు నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటాయని స్పష్టం చేశారు. శాసనసభ లోపల, బయట ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తామని తెలిపారు.
రాజకీయంలో గెలుపోటములు సహజమని, కానీ ప్రజాక్షేమమే పరమావధిగా పనిచేసిన చరిత్ర బీఆర్ఎస్‌దని ఉద్ఘాటించారు. కార్యకర్తలు అధైర్యపడకుండా ప్రజల్లోనే ఉంటూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.
రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి వేగం పుంజుకోవాలన్నా, సంక్షేమం ప్రతి ఇంటా వికసించాలన్నా కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని ప్రజలు ఇప్పటికే గ్రహించారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో ప్రజా మద్దతుతో బీఆర్ఎస్ పార్టీ తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని, కేవలం రెండేళ్ల వ్యవధిలోనే తిరుగులేని రాజకీయ శక్త్యాలంబనగా అవతరించి మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం, రాష్ట్ర ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# తెలంగాణలో పెరగనున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 27: తెలంగాణలో వాతావరణ పరిస్థితులు క్రమంగా మారుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఆకాశం నిర్మలంగా ఉండటంతో పాటు పొడి వాతావరణం కొనసాగుతోంది. రానున్న రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి.నేటి నుంచి పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34 నుంచి 35 డిగ్రీల సెల్సియస్‌ను దాటే అవకాశం ఉంది. అయితే ఉదయం వేళల్లో మాత్రం వాతావరణం ఆహ్లాదకరంగా ఉండనుంది. ఈ నెల 29న దక్షిణ తెలంగాణలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా ప్రాంతాల్లో అక్టోబర్ 2 వరకు ప్రధానంగా పొడి వాతావరణమే కొనసాగే అవకాశం ఉంది.అక్టోబర్ 2 తర్వాత గాలుల దిశలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. తూర్పు దిశ నుంచి వీచే గాలుల ప్రభావంతో ఆగ్నేయ తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో ఈ ప్రభావం కనిపించే అవకాశం ఉన్నట్లు అంచనాలు చెబుతున్నాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో మాత్రం పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉంది.వర్షాకాలం నుంచి పొడి వాతావరణ పరిస్థితుల వైపు తెలంగాణలో మార్పు ప్రారంభమైనట్లు వాతావరణ పరిశీలనలు సూచిస్తున్నాయి. తేమతో కూడిన తూర్పు గాలులు బలపడితేనే రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ విస్తృతంగా వర్షాలు నమోదయ్యే అవకాశం ఉంటుంది. మొత్తంగా రానున్న రోజుల్లో ఉదయం వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నప్పటికీ, పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగే అవకాశం ఉంది. దక్షిణ తెలంగాణలో ఈ నెల 29న ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశమున్నందున ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER